ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అనకాపల్లి
జిల్లా వార్తలు
7
శుక్రవారం 15 ఆగస్టు 2025

ఏసీబీ వలలో ఎస్ఐ

- సీజ్ చేసిన దుకాణం తాళాలు ఇచ్చేందుకు యజమాని నుంచి రూ.50 వేలు తీసుకుంటూ పట్టుబడిన అనకాపల్లి పట్టణ ఎస్ఐ

- వార్త మెయిన్ ఎడిషన్‌లో


ఎస్ఐ ఈశ్వరరావు (ఫైల్ ఫొటో)


ఎన్టీఆర్ స్టేడియంలో పూర్తయిన ఏర్పాట్లు

స్వాతంత్ర్య దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లాస్థాయి వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న హోం మంత్రి అనిత

అనకాపల్లి టౌన్/ కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. వర్షాల కారణంగా మైదానం బురదమయం కావడంతో క్రషర్‌బుగ్గిని చల్లించి చదును చేయించారు. మైదానంలో ఢిల్లీ ఎర్రకోట తరహాలో సెట్ వేశారు. వివిధ ప్రభుత్వ శాఖల కోసం 11 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖల ప్రగతిని ప్రదర్శించానికి శకటాలను సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు హోం మంత్రి వంగలపూడి అనిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేస్తారు. కాగా జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని గురువారం రాత్రి జాతీయ జెండాలోని మూడు రంగులతో విద్యుత్ దీపాలను అలంకరించారు.


విద్యుద్దీప కాంతుల్లో కలెక్టర్ కార్యాలయం

నేడు
మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అనకాపల్లిలో ప్రారంభించనున్న రాష్ట్ర హోం మంత్రి అనిత

స్త్రీశక్తికి శ్రీకారం

- రెండు డిపోల్లో 200 బస్సులు అందుబాటు
- ఉచితం నుంచి ఘాట్ సర్వీసులకు మినహాయింపు


పల్లె వెలుగు బస్సు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): **రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం' శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఈ పథకానికి 'స్త్రీశక్తి'గా ప్రకటించింది. శుక్రవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించనున్నారు.**

ప్రభుత్వం ప్రకటించిన ఐదు రకాల బస్సుల్లో మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే మహిళలు తమ వెంట ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. బస్సు కండక్టర్‌కు కార్డు చూపితే 'జీరో ఫేర్' టికెట్ ఇస్తారు. అనకాపల్లి డిపోలో 98 బస్సులు ఉన్నాయని, వీటిలో అంతర్రాష్ట్ర సర్వీసు ఒకటి, ఘాట్ సర్వీసులు రెండు (జోలాపుట్టు) మినహా మిగిలిన 95 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని డీపీటీవో వి.ప్రవీణ తెలిపారు. సంస్థకు చెందిన బస్సులతోపాటు అద్దె బస్సులను కూడా సిద్ధం చేశామని ఆమె తెలిపారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి, ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనంగా బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని ఆమె తెలిపారు. నర్సీపట్నం డిపోలో మొత్తం 102 బస్సులు వున్నాయి. వీటిలో అల్ట్రా డీలక్స్ బస్సులు 20 వున్నాయి. వీటిల్లో 17 బస్సులు విశాఖపట్నం నాన్ స్టాప్, మిగిలిన మూడు విజయవాడ,హైదరాబాద్, కాకినాడలకు నడుస్తున్నాయి. మిగిలిన 82 సర్వీసుల్లో 18 బస్సులు ఘాట్ రోడ్లలో ప్రయాణిస్తున్నాయి. వీటిని మినహాయించి మిగిలిన 64 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

ఘాట్ సర్వీసులకు ఉచితం వర్తించదు

నర్సీపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఘాట్ మార్గాల్లో నడిచే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం వర్తించదు. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిప్రకారం నర్సీపట్నం డిపో నుంచి వివిధ ప్రాంతాలకు నడిచే 18 ఘాట్ సర్వీసుల్లో మహిళలు యథావిధిగా టికెట్ తీసుకుని ప్రయాణించాల్సిందే. ఘాట్ మార్గాల్లో నడిచే బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కితే ప్రమాదమన్న ఉద్దేశంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. నర్సీపట్నం నుంచి చింతపల్లికి టు స్టాప్ సప్తగిరి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 6, నర్సీపట్నం నుంచి సీలేరుకు అల్ట్రా పల్లె వెలుగు సర్వీసులు 2, మొండిగెడ్డ, నర్సీపట్నం నుంచి రాజమహేంద్రవరం (వయా కృష్ణాదేవి పేట), దేవరాపల్లి, గుమ్మిరేవుల, మారేడుమిల్లి, మంప, గుడ్లపల్లి, రేవళ్లు, రంపుల పల్లె వెలుగు సర్వీసులను ఉచిత ప్రయాణం నుంచి మినహాయించారు. ఈ బస్సుల్లో 'జీరో టికెట్' జారీ చేయరు.

సీనియర్ ఐపీఎస్ అధికారి

'కిల్లాడ'కు రాష్ట్రపతి సేవా పతకం

- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్ర హోం శాఖ
- ప్రస్తుతం యూపీలో అదనపు డీజీపీ హోదాలో పనిచేస్తున్న సత్యనారాయణ

కోటవురట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాములవాకకు చెందిన ఉత్తరప్రదేశ్ కేడర్ సీనియర్ ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ రాష్ట్రపతి సేవా మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. సత్యనారాయణ 1997లో సివిల్ సర్వీసెస్ ద్వారా ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అంతకుముందు నర్సీపట్నం మండలం బలిఘట్టం పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఐపీఎస్ శిక్షణ అనంతరం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించారు. తొలుత ఆగ్రా ఏఎస్పీగా పోస్టింగ్ పొందారు. ఒకవైపు పోలీసు అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సివిల్స్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కెరీర్‌గైడెన్స్ శిక్షణ ఇచ్చేవారు. చంబల్‌లోయలో బందిపోట్లను కట్టడి చేయడం, వారాణసి డీఐజీగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేశారు. గతంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడు (2014-19) ఏపీకి డిప్యూటేషన్‌పై వచ్చి అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. నర్సీపట్నంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇప్పించారు. పాములవాక

... మిగతా 10వ పేజీలో


కిల్లాడ సత్యనారాయణ, సీనియర్ ఐపీఎస్ అధికారి

హార్టికల్చర్‌కు అధికారుల కొరత

జిల్లాలో సగం క్లస్టర్లకు ఇన్‌చార్జిలే దిక్కు

- ఒక్కో హెచ్‌వోకు ఐదారు మండలాల బాధ్యతలు
- ఉద్యాన రైతులకు సేవల్లో తీవ్ర జాప్యం

చోడవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): **ఉద్యాన శాఖలో అధికారుల కొరత కారణంగా రైతులకు సకాలంలో సేవలు అందడంలేదు. ఒక పక్క ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తుంటే.. మరోవైపు ఆ శాఖలో పూర్తిస్థాయిలో అధికారులు లేకపోవడం పథకాల అమల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రత్యేకించి చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు రెగ్యులర్ హార్టికల్చర్ అధికారులు కొరత ఉద్యాన రైతులకు శాపంగా మారింది.**

చోడవరం క్లస్టర్ ఉద్యాన శాఖకు మూడేళ్లుగా రెగ్యులర్ హెచ్‌వో లేరు. ఈ క్లస్టర్ పరిధిలో చోడవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట మండలాలు ఉన్నాయి. ఇక్కడ హెచ్‌వోగా పనిచేసిన గణేశ్ మూడేళ్ల క్రితం పదోన్నతిపై పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి చోడవరానికి రెగ్యులర్ హెచ్‌వో లేరు. మాడుగుల హెచ్‌వో భానుపుష్పలీల... చోడవరం క్లస్టర్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో చోడవరానికి రెగ్యులర్ హెచ్‌వోను నియమించినప్పటికీ ఆమె ఇక్కడ బాధ్యతలు చేపట్టకుండానే విజయనగరం జిల్లా ఎస్.కోటకు బదిలీపై వెళ్లిపోయారు. ఇక మాడుగుల హెచ్‌వో భానుపుష్పలీల భీమిలికి బదిలీకావడంతో అక్కడకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి మాడుగుల, చోడవరం క్లస్టర్లకు ఇన్‌చార్జిలే దిక్కు అయ్యారు. ప్రస్తుతం మాడుగుల క్లస్టర్‌కు దేవరాపల్లి హెచ్‌వో, చోడవరం క్లస్టర్‌కు అనకాపల్లి హెచ్‌వో ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. మాడుగుల క్లస్టర్ పరిధిలో మాడుగుల, రావికమతం మండలాలు ఉన్నాయి. దేవరాపల్లి హెచ్‌వో దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలతోపాటు మాడుగుల, రావికమతం మండలాలను పర్యవేక్షించాల్సి రావడం ఉద్యాన శాఖ కార్యక్రమాల అమలులో జాప్యం జరుగుతున్నది. చోడవరం ఇన్‌చార్జి హెచ్‌వో చోడవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట మండలాలతోపాటు అనకాపల్లి, అనకాపల్లి రూరల్, కశింకోట మండలాలను పర్యవేక్షించాల్సి వస్తున్నది. జిల్లాలో 24 మండలాలకుగాను ప్రస్తుతం ఐదుగురు హెచ్‌వోలు మాత్రమే వున్నారు. ఉద్యాన శాఖ అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రైతులకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందని పరిస్థితి నెలకొంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యానవనానికి పెద్దపీట వేయడంతోపాటు, ఆయా పంటలు, తోటల సాగుకు ప్రోత్సాహకాలతోపాటు, రాయితీలు కూడా ఇస్తున్నది. బిందు, తుంపర సేద్యం

... మిగతా 10వ పేజీలో


ఆయిల్‌పామ్, కోకో తోట

బాక్సింగ్ క్రీడాకారిణి మౌనికకు అరుదైన గౌరవం

- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఇచ్చే తేనీటి విందుకు ఆహ్వానం


బొంతు మౌనిక

నర్సీపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంకి చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి బొంతు మౌనికకు అరుదైన అవకాశం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం గవర్నర్ ఇచ్చే తేనీటివిందులో ప్రముఖులతోపాటు పాల్గొనేందుకు ఆహ్వానం అందుకుంది. గవర్నర్ కార్యాలయం కార్యదర్శి పంపిన లేఖను జిల్లా కలెక్టర్ ద్వారా మౌనిక అందుకుందని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఎల్‌వీ రమణ తెలిపారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదవుతున్న మౌనిక.. శాప్ బాక్సింగ్ కేంద్రంలో గత ఐదేళ్లుగా శిక్షణ పొందుతున్నది. కఠోర శ్రమతో బాక్సింగ్‌లో మెలకువలు నేర్చుకొని పదికిపైగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఒక బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించింది. 14సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఎనిమిది బంగారు, రెండు రజత పతకాలను సొంతం చేసుకుంది. హరియాణాలో నిర్వహించిన ఇండియా బాక్సింగ్ క్యాంప్‌నకు ఎంపికై ప్రత్యేక శిక్షణ తీసుకుంది. గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందుకున్న విషయం తెలుసుకొని పలువురు ఆమెను అభినందించారు.

చెక్కపై స్వాతంత్ర్య వేడుకలు

- కళానైపుణ్యతను చాటుకున్న సూక్ష్మ కళాకారుడు రవి

నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి సందర్భానుసారం తన కళానైపుణ్యతను చాటుకుంటున్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చెక్కపై జాతీయ జెండాను చేతపట్టిన పౌరుడు, భారత దేశ చిత్రపటం, అశోక చక్రం, ఇంగ్లిష్‌లో 'ఇండియా' అక్షరాలను అద్భుతంగా చెక్కి దేశ భక్తిని చాటుకున్నారు. ఈ సూక్ష్మ కళాఖండం తయారు చేయడానికి రెండు గంటల సమయం పట్టిందని దార్ల రవి చెప్పారు. - నక్కపల్లి/ఆంధ్రజ్యోతి


చెక్కపై రూపొందించిన దేశ చిత్రపటం, త్రివర్ణపతాకం, అశోక చక్ర, ఇండియా అక్షరాలు

గుర్తు తెలియని మహిళ హత్య

బాటజంగాలపాలెం వద్ద పాక్షికంగా కాలిన స్థితిలో గర్భిణి మృతదేహం

ఎక్కడో హత్య చేసి, మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారని పోలీసుల అనుమానం

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ తుహిన్ సిన్హా

సబ్బవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని బాటజంగాలపాలెం రెవెన్యూ పరిధి జాతీయ రహదారి సమీపంలో గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. శరీరం కొంతమేర కాలిపోయి వుండడంతో, మహిళను మరెక్కడో హత్యచేసి, తాళ్లతో కట్టేసి ఇక్కడకు తెచ్చి పెట్రోలు పోసి నిప్పంటించినట్టు గుర్తించారు. స్థానిక పోలీసుల సమాచారంతో ఎస్పీ తుహిన్ సిన్హా సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఇందుకు సంబంధించి అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ ఎల్.మోహనరావు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..**

బాటజంగాలపాలెం గ్రామానికి ఈపీడీసీఎల్ లైన్‌మన్ ఆగ్గాల సతీశ్, హెల్పర్ కాపుశెట్టి వీరునాయుడు గురువారం ఉదయం జాతీయ రహదారి సమీపంలో కోళ్లఫారానికి వెళ్లే మార్గంలో విద్యుత్తు వైర్లను తాకుతున్న ఉన్న చెట్టు కొమ్మలను తొలగించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో పాక్షికంగా కాలిపోయిన ఒక మహిళ మృతదేహం కనిపించింది. వెంటనే సర్పంచ్ పడాల వెంకటరమణకు ఫోన్ చేసి సమాచారం అందించారు. సర్పంచ్ ఈ విషయాన్ని సీఐ జి.రామచంద్రరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. హత్యకు గురైన మహిళకు 25 నుంచి 30 ఏళ్ల

... మిగతా 10వ పేజీలో


మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు



కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, ఎస్పీ తుహిన్ సిన్హా

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో స్మార్ట్ కంట్రోల్ రూమ్

- ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల, ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్‌ను గురువారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ కెమెరాల నిర్వహణను, కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన వివిధ జంక్షన్‌ల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారులపై వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని, వీటిని పరిష్కరించేందుకు డీసీఎంఎస్‌కు

... మిగతా 10వ పేజీలో

కోనాం సంతలో సీతాఫలాలకు కొరవడిన గిరాకీ

చీడికాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాంలో గురువారం జరిగిన సంతకు గిరిజనులు తీసుకువచ్చిన సీతాఫలాలకు గిట్టుబాటు ధర కరువైంది. బుధవారం రాత్రి భారీ వర్షం కురవడం, గురువారం ఉదయం ఆకాశం మేఘావృతంగా వుండడంతో మైదాన ప్రాంతం నుంచి కొద్ది మంది వ్యాపారులే సంతకు వచ్చారు. 60 సీతాఫలాలు వున్న బుట్ట రూ.400 మాత్రమే ధర పలికింది. దీంతో గిరిజనులు తీవ్ర నిరాశ చెందారు. మధ్యాహ్నం వరకు వేచిచూసినా వ్యాపారులు రాకపోవడంతో మిగిలిన ఫలాలను మరింత ధర తగ్గించి అమ్ముకోవాల్సి వచ్చింది.


కోనాం సంతలో సీతాఫలాలను అమ్మకానికి తెచ్చిన గిరిజనులు

రోడ్డుపై కూలిన భారీవృక్షం

- బైక్‌పై వెళుతున్న కెమికల్ కంపెనీ ఉద్యోగి మృతి
- మరొకరికి గాయాలు

పాయకరావుపేట మండలం పెదరాంభద్రపురం సమీపంలో గురువారం ఉదయం భారీ నిద్రగన్నేరు వృక్షం రోడ్డుపై కూలిపోవడంతో డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఉద్యోగి ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు.

- వార్త మెయిన్ ఎడిషన్‌లో


తోట శ్రీనివాసరావు (ఫైల్‌ఫొటో)

సాగునీటి కాలువలో తుప్పలను తొలగిస్తాం

▸▸ ఆవకాలువ చైర్మన్ సన్యాసినాయుడు



నీటిని విడుదల చేస్తున్న సన్యాసినాయుడు

మునగపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనకాపల్లి ఆవ కాలువలో తుప్పలు, పాదుల తొలగింపు పనులు చేపట్టనున్నామని సాగునీటి సంఘం చైర్మన్ ఆడారి ఆనంద సన్యాసినాయుడు తెలిపారు. మండలంలో తోటాడ వద్ద ఆవ కాలువపై ఉన్న రెగ్యులేటర్ గేట్లను ఎత్తి గురువారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక పెద్ద మదుం వరకు ఆవకాలువలో పేరుకుపోయిన తుప్పలతో పాటు విరిగిపడిన చెట్లను తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి మురళి, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

150 మందికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు



శిబిరంలో పాల్గొన్న టీడీపీ నేత నవీన్‌రాజు, మహిళలు

ఎస్.రాయవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు సచివాలయంలో గురువారం మాజీ ఎంపీపీ యేజర్ల వినోద్‌రాజు, టీడీపీ నేత యేజర్ల నవీన్ రాజు ఆధ్వర్యంలో చినజీయర్‌స్వామి హెల్త్ కేర్ సహకారంతో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. మహిళలకు డాక్టర్ లీల క్యాన్సర్ పరీక్షలు చేసి, అవగాహన కల్పించారు. శిబిరంలో 150 మంది పాల్గొన్నారు.

పలు చోట్ల హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



పాయకరావుపేటలో 200 అడుగుల జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నక్కపల్లిలో తిరంగా ర్యాలీ చేపడుతున్న అధికారులు, నాయకులు

పాయకరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో పాండురంగస్వామి ఆలయం నుంచి శ్రీలక్ష్మి థియేటర్ వరకు 200 అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ కొల్లూరి పూర్ణిమ, స్థానిక వాసవీక్లబ్ అధ్యక్షుడు వురా సత్యనారాయణ,కార్యదర్శి దాసరి ప్రదీప్, కోశాధికారి వాసు, రీజియన్ చైర్మన్ నాగేశ్వరరావు, జోన్ చైర్మన్ ప్రకాష్, జిల్లా ఇన్‌చార్జి శేఖర్‌బాబు, రీజినల్ సెక్రటరీ వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

నక్కపల్లి హైస్కూల్ నుంచి హైవే మీదుగా గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోఆర్‌డీ చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ జాతీయ పతాకాలను పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ, కేవీ సత్యనారాయణ, దార్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. పెదబోదిగల్లం హైస్కూల్‌లో విద్యార్థులు సుమారు 100 అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. అనంతరం 79వ అంకెతో చేసిన అక్షర విన్యాసం ఆకట్టుకుంది. కాగా స్వాతంత్ర్య వేడుకలకు పాఠశాలలు ముస్తాబయ్యాయి.

ఎలమంచిలిలో..

మండలంలోని ఏటికొప్పాకలో గురువారం బీజేపీ నేతలు, విద్యార్థులు కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీని బీజేపీ మండల అధ్యక్షుడు అగ్రహారపు కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలోని వీధుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తినింపేలా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పప్పు ఈశ్వరరావు, పిట్టా దాసుబాబు, నక్కా శివశంకర్, కొరుప్రోలు చిన్నారావులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్

ఎమ్మెల్యే సుందరపు, ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ

పట్టణంలో ఆకట్టుకున్న ట్రాక్టర్ల ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు



ఎలమంచిలి పట్టణంలో నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీ

ఎలమంచిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజారంజక పాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయని ఎమ్మెల్యే విజయకుమార్, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలో అన్నదాత సుఖీభవ పథకం విజయోత్సవ ర్యాలీని అట్టహాసంగా నిర్వహించారు. సుమారు 80 ట్రాక్టర్లతో రైతులు, మహిళలు, కూటమి నేతలు చేపట్టిన ట్రాక్టర్ల ర్యాలీని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సరే ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సుఖీభవతో రైతులకు ధైర్యాన్ని నింపిందన్నారు. ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్రయంతో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలుస్తుందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళల ఉచిత బస్ ప్రయాణం అమలు చేస్తున్నారన్నారు. సుమారు 80 ట్రాక్టర్లతో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించి, ప్రధాన రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకూ సాగింది. సూపర్ సిక్స్. సూపర్ సక్సెస్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొలుకులూరి విజయ్‌బాబు, కొఠారు సాంబ, ఆడారి మంజు, లవుడు లోవరాజు, రాజాన నారాయణమ్మ, కర్రి ఝాన్సీ, కరణం రవి, బొద్దపు శ్రీనివాసరావు, యల్లపు గోపి, కొఠారు శ్రీను, ఊటకూటి రమేష్, గుర్రాల శేఖర్ పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో 'పేట' సొసైటీ వ్యాపారం

చైర్‌పర్సన్ దేవవరపు రాజబాబు

బాధ్యతలు చేపట్టిన పీఏసీఎస్ పాలకవర్గం



పాయకరావుపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన దేవవరపు రాజబాబును సత్కరిస్తున్న నాయకులు



మునగపాక పీఏసీఎస్ చైర్‌పర్సన్ విల్లూరి నూక నర్సింగరావు, డైరెక్టర్లను సత్కరించిన ఉద్యోగులు, సిబ్బంది.

పాయకరావుపేట ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట సొసైటీ ఈ ఏడాది రూ.30 కోట్ల వ్యాపారం చేయాలని లక్ష్యంగా నిర్ణయించిందని సొసైటీ చైర్‌పర్సన్ దేవవరపు రాజబాబు తెలిపారు. గురువారం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా దేవవరపు రాజబాబు, డైరెక్టర్లు కట్టా నూకరత్నం, కూలి నానాజీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దేవవరపు రాజబాబు, డైరెక్టర్లను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాజబాబు మాట్లాడుతూ ఈ ఏడాది రైతులకు ఎరువులు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు, కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, బొంది కాశీవిశ్వనాథం, కట్టా శ్రీను, దేవవరపు వెంకట్రావు, మజ్జూరి నారాయణరావు, దేవవరపు రఘు, మలిపెద్ది వెంకటరమణ, కలిగట్ల శ్రీను, కంచి మాణిక్యం, పీఏసీఎస్ మేనేజరు పి.నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.



ఎలమంచిలి: పి.లక్కవరం సొసైటీ చైర్‌పర్సన్ కొలుకులూరి విజయ్‌బాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మునగపాకలో..

మునగపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాల మేరకు సేవలందిస్తామని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ విల్లూరి నూక నర్సింగరావు అన్నారు. మునగపాక సొసైటీ చైర్‌పర్సన్‌గా నర్సింగరావు, డైరెక్టర్లుగా మొల్లి అప్పలరాజు, పాలిపిని రాములు గురువారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం చేకూర్చే విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం పాలకవర్గానికి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

పి.లక్కవరంలో..

ఎలమంచిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.లక్కవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా కొలుకులూరి విజయ్‌బాబు, డైరెక్టర్లుగా ఉగ్గిన బాబూరావు, దుల్లా భగవాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గ సభ్యులకు పీఏసీఎస్ సీఈవో శివరామకృష్ణ టీడీపీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, నాయకులు రాజాన వెంకునాయుడు, ఇత్తంశెట్టి రాజు, మాజీ సర్పంచ్ నూకరాజు తదితరులు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విజయబాబు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి తామంతా సమిష్టిగా కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. పీఏసీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు

టీడీపీ నేతల సంబరాలు

పాయకరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):వైసీపీ కంచుకోట పులివెందుల, ఒంటిమెట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపు పట్ల పాయకరావుపేటలో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నాయకులు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, పెదిరెడ్డి చిట్టిబాబు, చించెలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, బొంది కాశీవిశ్వనాథం, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, కట్టా శ్రీను పాల్గొన్నారు.



పాయకరావుపేటలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు



నక్కపల్లిలో స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ నేతలు

నక్కపల్లిలో..

కడప జిల్లాలో పులివెందుల, ఒంటిమెట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అనూహ్య విజయం సాధించడం పట్ల గురువారం నక్కపల్లిలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ కేక్ కట్ చేసి అందరికి పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి వరహాలు, అడపా గణేశ్, పెదపూడి శంకరరావు, పెదబోదిగల్లం సర్పంచ్ షేక్ మున్నీషా బేగం, దార్ల కృష్ణ పాల్గొన్నారు.

అబ్బురపరిచిన విద్యార్థులు

79 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విన్యాసం

ఎలమంచిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కొత్తపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ సంఖ్య నమూనాలో చేపట్టిన విన్యాసం అందరిని అబ్బురపరిచింది. హైస్కూల్‌లో హెచ్‌ఎం. వైవీ రమణ, వ్యాయామ ఉపాధ్యాయుడు కుందూరు రాజు పర్యవేక్షణలో విద్యార్థులు ఈ విన్యాసం చేపట్టారు. చూపరులను సైతం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, విజయ, తదితరులు పాల్గొన్నారు.



79 వ స్వాతంత్ర్య సంఖ్య నమూనాలో విద్యార్థులు

పది వేల ఇళ్లకు సోలార్ విద్యుత్

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నియోజకవర్గంలో పది వేల ఇళ్లకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం ఏపీఐఐసీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఏపీఈపీడీసీఎల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ పథకంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. విద్యుత్ వినియోగదారునికి కలిగే లాభాల గురించి వివరించి, ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు కృషిచేయాలన్నారు.

బకాయి బిల్లులు చెల్లింపు

గత వైసీపీ ప్రభుత్వంలో బకాయి పడిన బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నామని ఎమ్మెల్యే విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రూ.29.12 లక్షలు గురువారం ఆయన కాంట్రాక్టర్లకు చెల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు తప్పనిసరిగా బిల్లులు చెల్లించడం ప్రభుత్వం బాధ్యత అని అన్నారు. గత ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడి బిల్లులు చెల్లించలేదన్నారు. ప్రతి బకాయిని కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అనంతరం పీ-4 కార్యక్రమంపై అధికారులతో ఎమ్మెల్యే విజయకుమార్ సమీక్ష జరిపారు. పేదరిక నిర్మూలనకై కూటమి ప్రభుత్వం పీ-4ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అధికారులు ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

ఏటికొప్పాక సాగునీటి కాలువలో రైతుల శ్రమదానం

▸▸ కాలువ వెంబడి చెత్తను తొలగింపు



ఏటికొప్పాకలో సాగునీటి కాలువలో చెత్తను తొలగిస్తున్న రైతులు

ఎలమంచిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టు రైతులు సాగునీటి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు సమిష్టిగా ముందుకు కదిలారు. ఏటికొప్పాక సాగునీటి కాలువలో చెత్త పేరుకుపోవడంతో పంట పొలాలకు సాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదు. దీంతో రైతులు గురువారం గ్రామంలోని సాగునీటి కాలువలోని చెత్తను తొలగించారు. సాగునీటి కాలువలో చెత్తను వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.

బహిరంగ మలవిసర్జన వద్దు

▸▸ స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర కమిటీ ప్రతినిధి దర్శి చందు



యండపల్లిలో వ్యక్తిగత మరుగుదొడ్లును పరిశీలిస్తున్న చందు

కోటవురట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రతి ఒక్కరూ బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు సహకరించాలని కేంద్ర కమిటీ ప్రతినిధి దర్శి చందు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2025కి గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ ప్రతినిధి చందు గురువారం మండలంలోని యండపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో గల సంపద కేంద్రం, కాలువలు, బహిరంగ మలవిసర్జన, వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగాన్ని పరిశీలించారు. అలాగే గ్రామంలో ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. గ్రామ సచివాలయం కార్యాలయం, హెల్త్‌సెంటర్ భవనాలు పరిశీలించారు. గ్రామంలో 14 వ్యక్తిగత మరుగుదొడ్లు పరిశీలించారు. ఆయనతోపాటు ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మరావు, ఏపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ పాల్గొన్నారు.

సత్యవరంలో..

పాయకరావుపేట రూరల్: మండలంలోని సత్యవరంలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ బృందం పర్యటించింది. పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలు, కొన్ని ఇళ్లను సందర్శించారు. పారిశుధ్య నిర్వహణ, సంపద కేంద్రం నిర్వహణ, పాఠశాలలో మంచి నీటి కొళాయిలను పరిశీలించి తనిఖీ చేశారు. కార్యక్రమంలో బృందం సభ్యులు కె. శ్రీనివాస్, సర్పంచ్ నకిలేటి రాము, పంచాయతీ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా యువజన మందిరం వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించిన దృశ్యం

మునగపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మునగపాక గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక నందీశ్వర ప్రాంగణంలోని తులసీ కళావేదికపై గురువారం నాటిక ప్రదర్శనలతోపాటు రంగస్థల నటులకు సన్మానం చేశారు. తొలుత నటరాజ్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి రాము, పెంటకోట సత్యనారాయణ, మళ్ల సంజీవరావు, రామజోగి, సూర్యచంద్రరామారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మాతృదేవోభవ' నాటిక

వార్షికోత్సవంలో భాగంగా పెందుర్తి కళాకారులు పిల్లా సన్యాసిరావు దర్శకత్వంలో ప్రదర్శించిన మాతృదేవోభవ నాటిక ప్రేక్షకులనుఆకట్టుకుంది. ఆడారి సోమశేఖర్ రచన చేసిన ఈ నాటిక నేటి యువత అమ్మతనంపై చూపుతున్న నిర్లక్ష్యం ప్రధాన కథాంశంగా సాగింది. అనంతరం సీనియర్ రంగస్థల నటుడు కాండ్రేగుల జగ్గారావును సత్కరించారు.

కృష్ణాష్టమికి ముస్తాబవుతున్న ఆలయాలు

మునగపాక, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. మునగపాక, పాటిపల్లి, గొల్లలపాలెం, వాడ్రాపల్లి, రామగిరి, ఒంపోలు తదితర గ్రామాల్లో ఉన్న ఆలయాలను కమిటీ సభ్యులు ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 16వ తేదీ నుంచి ఉత్సవాలు మొదలవుతాయని నిర్వాహకులు తెలిపారు.

మార్కెట్ యార్డులో త్వరలో రైతు బజార్ ఏర్పాటు

- డీసీఎంఎస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం
- పార్కింగ్ స్థలం ప్రారంభంలో ఎమ్మెల్యే కొణతాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో ఎస్పీ సిన్హా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మార్కెట్ యార్డులో త్వరలోనే రైతు బజార్ ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెల్లడించారు. కూరగాయల మార్కెట్ వద్ద గల డీసీఎంఎస్ స్థలంలో ట్రాఫిక్ పోలీసుల సహకారంతో వాహనాలు నిలుపుకోవడానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని గురువారం ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల వారికి అనువుగా ఉండేలా మార్కెట్ యార్డులో రైతు బజార్ ఏర్పాటు కానుందన్నారు. కూరగాయలే కాకుండా అరటి, కొబ్బరికాయల మార్కెట్ కూడా అక్కడే వస్తుందన్నారు. వర్తకులకు దుకాణాలు ఏర్పాటు చేస్తామన్నారు. వ్యాపారులందరి పేర్లు నమోదు చేసుకొని వారు వ్యాపారం చేసుకోవడానికి స్థలాలు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. అక్కడే కోల్డ్ స్టోరేజీ కూడా ఉందన్నారు. 18 ఏళ్లగా డీసీఎంఎస్ స్థలం నిరుపయోగంగా ఉన్నట్టు చెప్పారు. ఒకప్పుడు ఈ ప్రదేశంలో డీసీఎంఎస్ పెద్ద ఎత్తున బెల్లం వ్యాపారం చేసేదన్నారు. ఈ ప్రదేశంలో కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని భావించామన్నారు. డీసీఎంఎస్‌కు ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ అనకాపల్లి విస్తరిస్తున్నందున ట్రాఫిక్ సమస్య ఉందన్నారు. ఎక్కడపడితే అక్కడ ప్రజలు వాహనాలను పార్కింగ్ చేయకుండా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలుపుకోవాలని సూచించారు. ఈ పార్కింగ్ స్థలం ఏర్పాటుకు కృషి చేసిన అనకాపల్లి ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణను ఎమ్మెల్యే కొణతాల, ఎస్పీ తుహిన్‌సిన్హా సత్కరించారు. డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రావణి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి విజయనాయుడు, టీడీపీ 84వ వార్డు ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, సీఐలు ఎం.వెంకటనారాయణ, టీవీ విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, డీసీఎంఎస్ బీఎం సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాల పంపిణీ


వెంకట్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

సబ్బవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యా నికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. గురువారం పెందుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో అనారోగ్యానికి గురైన మండలానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడాల వెంక టరమణ, కర్రి కనకరాజు, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, ఎస్.రవి, గండి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు'

తుమ్మపాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అక్కడి ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు టీడీపీ అభ్యర్థినికి అఖండ మెజార్టీని సమకూర్చారన్నారు. ఇది చూసిన జగన్‌రెడ్డి గుండెల్లో భయం మొదలైందన్నారు. జగన్‌రెడ్డి పతనం ఈ ఎన్నికతోనే ప్రారంభమైందని చెప్పారు. ఓవైపు ముఖ్యమంత్రి పదవి పోయి ప్రతిపక్ష హోదా సైతం దక్కకపోవడం, మరోవైపు ఈడీ కేసులు ముంచుకొస్తుండడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో జగన్‌రెడ్డికి, వైసీపీకి అడ్రస్ లేకుండా పోవడం తథ్యమన్నారు.

ఏఎంఏఎల్ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు


కృష్ణుడు, గోపికల వేషధారణలో బాలబాలికలు

కొత్తూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా పలువురు బాలబాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) ముఖ్య అతిథిగా మాట్లాడారు. శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ అధ్యక్షుడు గ్రంథి సురేష్, కరస్పాండెంట్ కొణతాల శివకుమార్, ఆస్క్ కళాశాల కరస్పాండెంట్ బాల సుబ్రహ్మణ్యం, ఎలిమెంట్రీ స్కూల్ అధ్యక్షులు ఉషాసాగర్, కరస్పాండెంట్ బుద్ద సంతోష్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

6,750 నోట్ పుస్తకాలు అందజేత


హెచ్‌ఎంలకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ ప్రతినిధులు

పరవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 1350 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు నోట్ పుస్తకాలు చొప్పున 6,750 పుస్తకాలను సమకూర్చారు వీటిని ఎంఈవోలు ఎం.దివాకర్‌రావు, సాయిశైలజా సమక్షంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం ఎంఈవో కార్యాలయంలో అందజేశారు. ఈ పుస్తకాలను విద్యార్థులకు త్వరగా అందించాలని సీఎస్‌ఆర్ ప్రతినిధులు ప్రకాశరావు, శివం కోరారు.

మేయర్ దృష్టికి 82వ వార్డు సమస్యలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 82వ వార్డులో గల సమస్యలను పరిష్కరించాలని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావును వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి వార్డులో సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు జానకిరామరాజు పాల్గొన్నారు.

జేజేలు పలుకుతూ.. జెండాలతో కదులుతూ..

- అనకాపల్లిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ
- ఎమ్మెల్యే కొణతాల, ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ జాహ్నవి హాజరు




అనకాపల్లిలో జాతీయ జెండాలతో ర్యాలీలో ఎమ్మెల్యే కొణతాల, ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ జాహ్నవి తదితరులు..., నెహ్రూ చౌక్‌లో మానవహారం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : హర్ ఘర్ తిరంగా ర్యాలీని గురువారం అనకాపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎస్పీ తుహిన్‌సిన్హా, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పచ్చజెండాను ఊపి ప్రారంభించారు. స్టేడియం నుంచి ఎన్టీఆర్ జంక్షన్, మెయిన్‌రోడ్డు మీదుగా నెహ్రూచౌక్‌కు చేరుకుంది. దారి పొడవునా ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలు కూడా జాతీయ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, క్రీడాకారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు, పెదగొల్లలపాలెంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గొంప నరసింగరావు, ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దేశ భక్తి పెంపొందాలన్నారు. అలాగే జాతీయ సమైక్యతను చాటాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రెడ్డి రామునాయుడు, వనం సత్యనారాయణ, పెచ్చెటి అప్పారావు, సామ్రాట్‌కుమార్, బి.అప్పారావు, హరిబాబు తదితరులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సబ్బవరంలో గురుకుల విద్యాలయం విద్యార్థుల ర్యాలీ


సబ్బవరం మండలం పెదగొల్లలపాలెంలో...

అనకాపల్లిలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాల జలమయం
- ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులకు అవస్థలు


అనకాపల్లిలోని ఓ వీధిలో కుండపోతగా కురుస్తున్న వర్షం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో వాయు గుండం కారణంగా అనకాపల్లి పట్టణంలో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో అనకాపల్లి- చోడవరం మధ్య రాకపోకలు సాగించే వారికి అవస్థలు తప్పలేదు. భారీ వాహనాలు, బస్సులు నాయుళ్ల వీధి, లక్ష్మీదేవిపేట గేటు మీదుగా రాకపోకలు సాగించాయి. రైళ్ల రాకపోకల సమయంలో గేటు పడడం వల్ల వాహనచోదకుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఏది ఏమైనా ఈ వర్షం వరినారు మండులకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


గవరపాలెంలో మరిడిమాంబను దర్శించుకుంటున్న నాగజగదీశ్వరరావు

నేత్రపర్వంగా మరిడిమాంబ పండుగ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీదేవిపేట, కోట్నివీధి, గవరపాలెం ప్రాంతాల్లో మరిడిమాంబ పండుగను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆయా ఆల యాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించిన అనంతరం పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. లక్ష్మీదేవిపేటలో అమ్మవారిని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు దర్శించుకున్న అనంతరం ప్రభల ఉత్సవంలో పాల్గొన్నారు. ఇదిలావుంటే, గవరపాలెంలోని మరిడిమాంబను మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఆయన వెంట పొలిమేర నాయుడు, సూరిశెట్టి బల్లమ్మ, పెతకంశెట్టి శ్రీనివాసరావు, మళ్ల నాయుడు తదితరులు ఉన్నారు.


ప్రభల ఊరేగింపులో పాల్గొన్న సురేంద్ర

మారేడుపూడిలో కేంద్ర బృందం పర్యటన

అనకాపల్లి రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుపూడి పంచాయతీలో 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2025'లో భాగంగా కేంద్ర బృందం గురువారం పర్యటించింది. పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాలను సం దర్శించారు. పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల వినియో గంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో సర్పంచ్ సాలాపు కనకరాజు, కార్యదర్శి జానకేశ్వరరావుబాబు పాత్రను ప్రశంసించారు. ఈ బృందంలో చంద్రరావు తదితరులు ఉన్నారు.

అధ్వానంగా ఎన్టీపీసీ ప్రధాన రహదారి

- పలు చోట్ల పెద్ద గుంతలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


రహదారిపై పలు చోట్ల ఏర్పడిన గుంతలు

పరవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ఊటగెడ్డ కూడలి నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారికి మరమ్మతులు చేపట్టి ఏడాది కాకముందే గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు మండిపడుతున్నారు. ఇదే రహదారి గుండా సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, నునపర్తి, తంతడి పంచాయతీలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రహదారిపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. పరిమితికి మించి బొగ్గు లోడుతో ప్రయాణిస్తున్న లారీలు కూడా ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారిపై గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చేలా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.



చదువుకునేందుకు ఎన్ని కష్టాలో..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవస్థలు పడుతున్నారు. ఒక చోట పాఠశాల ఉంటే ఉపాధ్యాయుడులేక, కొన్ని గ్రామాల్లో విద్యార్థులున్న చోట పాఠశాలలులేక ఇబ్బంది పడుతున్నారు. ఇదే దుస్థితి సీలేరు మండలం చెరుకుమళ్లు, పెదబయలు మండలం సావడిమామిడిలో ఉన్నాయి. అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా వ్యవహరిస్తుండంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చెరుకుమళ్లులో ఉపాధ్యాయుడు లేక..



ఉపాధ్యాయుడి కోసం వేచి చూస్తున్న చిన్నారులు

సీలేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చెరుకుమళ్లగ్రామంలోని జీపీఎస్ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలు ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఉపాధ్యాయుడిని నియమించడకపోవడంతో తమ పిల్లలు విద్యకు దూరమైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పాఠశాలలో 25 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారని, అధి కారులు రోజూ పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నపటికీ ఉపాధ్యాయుడు మాత్రం ఎవరూ రాకపోవడంతో నిరాశ చెందుతున్నారన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎగువసావడిమామిడిలో పాఠశాల దూరాభారం



ఎగువ సావడి మామిడిలో పాఠశాలలేక ఇబ్బంది ఎదుర్కొంటున్న విద్యార్థులు

పెదబయలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలం కిముడుపల్లి పంచాయతీ పరిధి ఎగువ సావడిమామిడి గ్రామంలో 20 మందికి పైగా బడిఈడు పిల్లలు ఉన్నారు. వీరికి గ్రామంలో పాఠశాల లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రతి తరగతిలో విద్యార్థులు న్నారు. వీరంతా గ్రామంలో పాఠశాల లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూ రంలో ఉన్న మచ్చిపల్లి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలక వెళ్లాల్సి వస్తోంది. రానుపోనూ రోజూ ఆరు కిలోమీటర్లు తమ పిల్లలు నడవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో బురదమయమైన రోడ్డులో నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లి రావడానికి చిన్నారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు తగిన మంది ఉన్నందున ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి తమ గ్రామంలో పాఠశాల మంజూరు చేయాలని విద్యార్థులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

దివ్యాంగుల భవితకు తోడ్పాటు

» ఏఎంవో భాస్కరరావు



ఎమ్మార్సీని పరిశీలిస్తున్న ఏఎంవో భాస్కరరావు

డుంబ్రిగుడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని జిల్లా విద్యాశాఖ ఏఎంవో భాస్కర్‌రావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం భవిత కేంద్రానికి వెళ్లి అక్కడి ఆట వస్తువులు పరిశీలించారు. చిన్నారుల బోధన సామర్థ్యాలను పరిశీలించారు. దివ్యాంగులను క్రమం తప్పకుండా రోజూ భవిత కేంద్రానికి తీసుకురావాలన్నారు. వారిలో మానసిక ఉల్లాసాన్ని కలిగించాలన్నారు. ఆత్మస్థైర్యంతో వారు ఎదిగేలా వారిని తీర్చిదిదాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవోలు సుందర్రావు, నాగేశ్వరరావు, మోనిటరింగ్ అధికారి నారాయణ, సీఆర్‌పీలు బాలు, నాగేంద్ర, కాంతారావు, ఐఆర్టీ కిరణ్ తదితరులు ఉన్నారు.

గత్తెరజిల్లేడ రోడ్డుపై అవస్థలు ఎన్నాళ్లు?

» గుంతల నీటిలో వరినాట్లు వేసి నిరసన



బురదమయమైన రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలుపుతున్న యువకులు

డుంబ్రిగుడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రాయి పంచాయితీ పరిధిలో ఉన్న గత్తెరజిల్లేడ రోడ్డు అభివృద్ధి చేయాలని కోరుతూ గురువారం గ్రామానికి చెందిన యువకులు ఆందోళన చేపట్టారు. రోడ్డు మధ్యలో నీటి గుంతలో వరినాట్లు వేస్తూ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మట్టి రోడ్డుగా వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. దశాబ్దాలుగా ఈ రోడ్డుకు తారు వేయడంలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా అధికారులు మారుతున్నా తమ గ్రామ రోడ్డు దుస్థితి మాత్రం మార్పులేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు మండల, జిల్లా స్థాయి అధికారులకు ఈ సమస్యపై విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు , అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రికి వాటర్ డిస్పెన్సర్ వితరణ



ఏరియా ఆస్పత్రి సిబ్బందికి వాటర్ డిస్పెన్సర్ అందజేసిన ఎస్‌ఆర్‌సీ కంపెనీ ప్రతినిధులు

చింతపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి రోగులకు గ్రీన్ ఫీల్డ్ హైవే యాజమాన్యం, ఎస్‌ఆర్‌సీ కంపెనీ ప్రతినిధులు వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. గురువారం గ్రీన్ ఫీల్డ్ హైవే, ఎస్‌ఆర్‌సీ కంపెనీ అధినేత, కల్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు జన్మదినం పురస్కరించుకుని దీనిని అందజేశారు. ప్రస్తుత సీజన్‌లో రోగులకు మినరల్ వాటర్‌తోపాటూ వేడినీళ్లు ఈ వాటర్ డిస్పెన్సర్‌పొందవచ్చునని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కంపెనీ ప్రాజెక్టు ఇన్ చార్జి రంజిత్ కుమార్, ప్రతినిధులు సత్యనారాయణ, ప్రసాద్, వైద్యాధికారులు వాసవి, లావణ్య, రుక్మిణి, సంతోశ్, చంద్రశేఖరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

ఎ.శనివారంలో పారిశుధ్య పనులు



డ్రైనేజీలో పూడిక తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

చింతపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.శనివారం పంచాయతీలో పారిశుధ్యం కల్పనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు స్థానిక సర్పంచ్ పేట్ల రాజుబాబు తెలిపారు. గురువారం వీధుల్లో డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పు వల్ల వ్యాధులు ప్రబలకుండగా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రైనేజీల్లో పూడికను తొలగిస్తున్నామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. గ్రామస్థులు పరిసరాలను పరిశు భ్రంగా ఉంచాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా కార్మికులు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్. శివ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి

» పసుపు, మిరియాల రైతులకు రాయితీపై యంత్రపరికరాలు

» ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త చెట్టి బిందు



రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త బిందు

చింతపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మిరియాలు, పసుపు ఉత్పత్తికి ఆదివాసీ రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి చెట్టి బిందు అన్నారు. గురువారం ఉద్యాన పరిశోధన స్థానంలో పాడేరు స్పైస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ అధికారి బి. కల్యాణి ఆధ్వర్యంలో గిరిజన రైతులకు మేలైన యా జమాన్య పద్ధతులపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ గిరిజన రైతులు కొన్నేళ్లుగా పసుపు, మిరియాల పంటలు సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించకపోవడం వల్ల నాణ్యమైన దిగుబడులు సాధించలేకపోతున్నారన్నారు. దీంతో మార్కెట్‌లో రైతులు తక్కువ ధరకు విక్రయించుకోవాల్సివస్తోందన్నారు. రైతులు పసుపు విత్తనాన్ని శుద్ధి చేసుకుని నాటడం వల్ల దుంపకుళ్లు తెగులును నివారించుకోవచ్చునన్నా రు. రైతులు ఎత్తైన మడుల్లో నాట్లు వేయడం వల్ల దిగుబడి పెరగడంతోపాటు తెగుళ్లను నియంత్రించుకోవచ్చునన్నారు. మిరియా పంటలో నీడ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ పంటలను రైతులు సేంద్రీయ పద్ధతిలో సాగు చేసుకోవాలన్నారు. పంటలకు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించరాదన్నారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాలతో సాగు చేసుకోవాలన్నారు. స్పైస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ అధికారి బి.కల్యాణి మాట్లాడుతూ గిరిజన రైతులుఉత్పత్తులను మార్కెట్‌కు అ నువుగా స్పైస్ బోర్డు ద్వారా మిరియాలు వలిచే యంత్రం, శుభ్రం చేసేయంత్రాలు, పసుపు ఉడకబెట్టే బాయిలర్, పాలిషర్, వర్మికంపోస్టు యూనిట్ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 75శాతం, వ్యక్తిగత రైతులకు 90శాతం రాయితీపై అందజేస్తున్నామన్నారు. గిరిజన రైతులు ఆర్గానిక్ ధ్రువీకరణ పత్రం, ఇండ్‌గ్యాప్ ధ్రువీకరణ పత్రం పొందేందుకు ఎఫ్‌పీవోలకు 50శాతం రాయితీ అందజేస్తున్నట్టుచెప్పారు. వీటి కోసం స్పైస్ బోర్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్: 8919475787 సంప్రదించాలన్నారు. ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త సందీప్ నాయక్, వీసీఎఫ్, టాటా ట్రస్టు నిపుణుడు డాక్టర్ అప్పలరాజు, సబ్ పరిధి రైతులు హాజరయ్యారు.

వసతి సమస్య పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ



కొత్తవలస పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతగిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న వసతి సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్‌శ్రీను, జీవన్‌కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం వారు పాఠశాల వద్ద మాట్లాడుతూ, సుమారు 350పైగా విద్యార్థులున్న ఈ పాఠశాలలోని రూపాంతర భ వనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. రేకులు నుంచి వర్షపునీరు లోనికి చేరడంతో రాత్రివేళల్లో విద్యార్థులు పడుకునేందుకు నకరం అనుభవిస్తున్నారన్నారు. నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, విద్యార్థులను సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం పాఠశాలను సందర్శించిన జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు విద్యార్థులను సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుకు వెళ్తానని హామీ ఇచ్చారు.

22 నుంచి పెసా కమిటీలకు ఎన్నికలు

కొయ్యూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వివాదాల మధ్య వాయిదా పడిన రాజేంద్రపాలెం, రేవళ్ళు, కినపర్తి పంచాయతీల్లో పెసా కమిటీ కార్యదర్శి, ఉపాధ్య స్థానాల ఎన్నికలు కలెక్టరు ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వీడీకే ప్రసాద్ తెలిపారు. వీటి నిర్వహణకు గానూ రాజేంద్రపాలెంనకు స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం గోపాలం, కినపర్తికి ఏఎస్‌వో చైతన్య, రేవళ్ళుకు సీడీపీవో దేవమణిని ఎన్నికల అధికారిగా నియమించామన్నారు. వీరికి ఎన్నికల నిర్వహణపై ఈ నెల 18న ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు.

పాఠశాలలో సమస్యలతో ఇబ్బందులు



పద్మాపురం గ్రామ పాఠశాల వరండాలో చదువుతున్న విద్యార్థులు

జి.మాడుగుల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంజరి పంచాయతీ పద్మాపురం ప్రభుత్వ పాఠశాలలో కనీస సదుపాయాలు కల్పించాలని గిరిజన ఐక్యవేదిక నేత కొండపల్లి మత్స్యరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాల భవనం మరమ్మతులకు గురైందని, విద్యుత్ సదుపాయం లేక చీకట్లో చిన్నారులు విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. పాఠశాలలో సుమారుగా 70 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నట్టు చెప్పారు. అధికారులు స్పందించి పా ఠశాలలో సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఆధార్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

కొయ్యూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డుల్లో తప్పొప్పులు సరిచేసేందుకు వీలుగా గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో వీడీకే ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు రావణాపల్లిలో గురువారం నుంచి 16వ తేదీ వరకు, ఆడాకులలో 18, 19, తేదీలలో, అంతాడ 22 , 23, బకులూరు 25 నుంచి 28 వరకు తాత్కాలిక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, స్థానికులు సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి



చింతపల్లి డిగ్రీ కళాశాలలో జాతీయ జెండాలతో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చింతపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి పిలుపునిచ్చారు. గురువారం కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. తొలుత కళాశాల ఆవరణలో అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు స్వాతంత్య్ర దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒకరు ఆగస్టు 15న దేశభక్తిని చాటిచెప్పే రోజన్నారు. జాతీయ జెండా ఉన్నతి, ఔన్నత్యాన్ని చాటిచెప్పాలన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

అరకులోయ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంపై హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డా.భరత్‌కుమార్ నాయక్, పట్టాసి చలపతిరావు, అధ్యాపకులు విద్యార్థులు గురువారం జాతీయజెండాను ఎగురవేశారు. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ప్రతీఇంటిపైనా జాతీయజెండాను ఎగురవేయాలని ఈ సందర్భంగా కోరారు. హర్‌ఘర్ తిరంగా పోర్టల్‌లో జెం డాతో సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేసి సర్టిఫికెట్ పొందాలని ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, అనితకుమారి, విజయలక్ష్మి ఈసందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అరకులోయలోని కళాశాలలో జాతీయ జెండా ఎగురవేస్తున్న అధ్యాపకులు

సీఆర్‌పీఎఫ్ జవాన్ల హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సీలేరు: సీలేరులో సీఆర్‌పీఎఫ్ ఎఫ్/42 బెటాలియన్ జవాన్లు వీధుల్లో మువ్వన్నెల జెండాను పట్టుకుని బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ అశోక్ మాట్లాడుతూ ప్రతి ఒకరకు 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఇళ్లపై జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సై రవీంద్ర పాల్గొన్నారు.



సీలేరులో బైక్ ర్యాలీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

విద్యతోనే భవిష్యత్తు: మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

డుంబ్రిగుడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజంలో నిలదొక్కుకోవడానికి ఆస్కారం ఉంటుందని జిల్లా మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. స మాజంలో మహిళల పాత్ర, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జనాల్లో మంచి, చెడులను గ్రహించి జాగ్రత్త పడాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. పాఠశాల, కళాశాల దశ నుంచి చక్కటి లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. ఉన్నత స్థితికి చేరేందుకు విద్య ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. క్రమశిక్షణతో ఎదిగి తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పాపినాయుడు, ప్రిన్సిపాల్ అ ప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిగరువును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



ర్యాలీ చేస్తున్న మద్దిగరువు ప్రాంత ప్రజలు

జి.మాడుగుల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మద్దిగరువును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆ పరిసర గ్రామ పంచాయతీల ప్రజలు డిమాండ్ చేస్తూ గురువారం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం జి.మాడుగులకు 40 కిలోమీటర్లు, పెదబయలు 70 కిలో మీటర్ల దూరంలో ప్రయాణం చేసి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. ప్రభుత్వం గుర్తించి మద్దిగరువు పరిసరాల్లోని 14 పంచాయతీల కలిగి ఉన్న తమ ప్రాంతానికి మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

పంచాయతీల నిధుల వ్యయంపై వివరాలివ్వాలని వినతి



ఎంపీడీవోకి వినతి పత్రం అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నీలకంఠం

ముంచంగిపుట్టు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్ట ప్రకారం మండలంలోని పంచాయతీల పరిధిలో గత నాలుగేళ్లలో ఎంత సొమ్ము ఖర్చు జరిగిందో పూర్తి స్థాయి సమాచారం అందించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి.నీలకంఠం కోరారు. ఈమేరకు ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తికి గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్ట ప్రకారం పంచాయతీల వారీగా గత నాలుగేళ్లుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏమేరకు నిధులు మంజూరు చేశాయి. ఎంత ఖర్చు చేశారని సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసినట్టు చెప్పారు. దాదాపు 102 రోజులైనా పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వలేదన్నారు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో నిధులు ఖర్చులకు సంబంధించి స్పష్టమైన సమాచారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీహెచ్‌సీ అంబులెన్స్ అందుబాటులో లేక అవస్థలు



సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందున్న బాధితుడితో మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) అంబులెన్స్‌లకు డీజిల్ ఆయిల్‌కు నిధులు మంజూరు చేయాలని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కె. త్రినాథ్ వైద్య అధికారులను కోరారు. తన పంచాయతీ పరిధిలో సంగంవలస గ్రామానికి చెందిన గురుమూర్తి(50)కి గురువారం ఆకస్మాత్తుగా కాలూ, చేతులు పనిచేయక అనారోగ్యం బారిన పడ్డారు. దీంతో 108కు సమాచారం అందించగా వాహనం అందుబాటులో లేదని అటునుంచి సమాధానం వచ్చినట్టు సర్పంచ్ తెలిపారు. చేసేది లేక ప్రైవేటు వాహనంలో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చినట్టు చెప్పారు. బాధితుడిని చూసిన వైద్యులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. మరోసారి ఉ దయం పది గంటల సమయంలో 108కు ఫోన్ చేయగా వాహనం అందుబాటులో లేదని చె ప్పారు. దీంతో సీహెచ్‌సీ వద్ద ఉన్న అంబులెన్స్‌ను ఇవ్వాలని కోరగా, ఆ వాహనానికి డీజిల్ లేదని వైద్యులు తెలిపినట్టు సర్పంచ్ చెప్పారు. ఇలా అయితే, అంబులెన్స్‌లు ఉన్నా ఏం ప్రయోజనమని సర్పంచ్ ధ్వజమెత్తారు. చివరికి సాయంత్రం 5 గంటల ప్రాంతంలో 108 వాహనం రావడంతోపాడేరు బాధితుడిని తరలించినట్టు చెప్పారు.

కొత్తభల్లుగుడ వద్ద కనువిందు



బల్లుగుడ వ్యూపాయింట్ వద్ద పంటపొలాల అందాలు

అరకులోయ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ప్రకృతి ప్రియులను అల రిస్తోంది. ఘాట్‌రోడ్డులో లోయలు, జలపాతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కొత్తభల్లుగుడ వ్యూపాయింట్ వద్ద పంట పొలాలు కనువిందు చేస్తున్నాయి. ఆకాశాన్ని అంటినట్టు పచ్చని కొండలు పర్యాటకులను కనువిందుజేస్తున్నాయి. ఇక్కడి వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు ఫొటోలు తీసుకుని వెళ్తున్నారు. పర్యాటక శాఖ ప్రత్యేకంగా వ్యూపాయింట్‌ను నిర్మిస్తే పర్యాటకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. శీతాకాలంలో ఇక్కడ పంటపొలాలున్న లోయం పాలసముద్రాన్ని తలపించేలా మంచు అందాలు పర్యాటకులను మైమరిపిస్తుంటారు. ప్రస్తుతం రోడ్డుపక్క ఆర్అండ్‌బీ నిర్మించిన రక్షణగోడలుపైకి వెళ్లి పర్యాటకులు ఫొటోలు దిగుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన గాలికొండ మాదిరిగా కొత్తభల్లుగుడ వద్ద వ్యూపాయింట్ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.


మాకవరపాలెంలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ శ్రేణులు

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం

» పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని ఘన విజయంపై నేతల సంబరాలు


గొలుగొండ మండలం చీడిగుమ్మలలో స్వీట్లు పంపిణీ

మాకవరపాలెం, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకోవడంతో మాకవరపాలెంలో గురువారం ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ వద్ద నాయకులు భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల అనంతరం పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుని టీడీపీ అభ్యర్థినికి భారీ మెజార్టీని అందించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ గెలుపు వైసీపీకి చెంపపెట్టు వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు, రుత్తల జోగిపాత్రుడు, పోతల రాంబాబు, లాలం రాము, నాని తదితరులు పాల్గొన్నారు.

చీడిగుమ్మలలో...

గొలుగొండ : పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని లతారెడ్డి ఘన విజయం సాధించడంతో మండలంలోని చీడిగుమ్మలలో ఆ పార్టీ నాయకులు కామిరెడ్డి గోవింద్, లాలం కాశీనాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం నమోదైందన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నర్సీపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇక్కడి అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'సోషల్ మీడియా-మంచీచెడు, సమాజంపై దాని ప్రభావం' అంశంపై జరిగిన ఈపోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంఎల్ఏఎస్, ఏబీఎం కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ బీఎల్ స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్, నర్సీపట్నం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు విజయ్, ప్రభాకర్, సీనియర్ జర్నలిస్టు రాము తదితరులు పాల్గొన్నారు.

గోవాడ ఫ్యాక్టరీపై అపోహలు వద్దు

క్రషింగ్ చేస్తాం... రైతులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే రాజు


రైతులు, ప్రజాసంఘాల నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీపై ఎలాంటి అపోహలు పెట్టుకోనవసరం లేదని, ఫ్యాక్టరీలో క్రషింగ్ జరుగుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ భవితవ్యంపై స్థానిక చెరకు రైతులు, ఇతర ప్రజాసంఘాలు సీపీఎం, నవయువ సమాఖ్య కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగానే గురువారం రైతులు ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజును పార్టీ కార్యాలయంలో కలిసి మాట్లాడారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతుల బకాయిలతో పాటు, కార్మికుల వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, గోవాడ షుగర్ ఫ్యాక్టరీని నడిపించాలనే ఉద్దేశంతో ఎంపీ సీఎం రమేశ్ నేతృత్వంలో తాను, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణతో కలిసి ఇక్కడి పరిస్థితిపై సీఎంకు వివరించామని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. గోవాడ ఫ్యాక్టరీ మూసివేస్తారన్న అపోహలు రైతులు నమ్మవద్దని హితవు పలికారు. రైతులు చెరకు సాగు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చెరకు రైతుల ప్రతినిధులు దండుపాటి తాతారావు, నవయువ సమాఖ్య నాయకులు నందారపు భాస్కరరావు, కోన మోహనరావు. సీపీఎం నాయకులు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు,నాయనిబాబు, ఎస్వీ నాయుడు,కార్మిక సంఘం నాయకులు శరగడం రామునాయుడు, రాయి సూరిబాబు, కొణతాల గంగీశ్వరరావు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

రావికమతం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తట్టబంద పంచాయతీకి చెందిన ముగ్గురుకి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు లబ్ధిదారులకు గురువారం అందజేశారు. తట్టబందలోని మోటూరు నాగమణికి రూ. 89,585, గుంట్ల లక్ష్మికి రూ.53,827, నమ్మి తేజశ్రీకి రూ.10వేలు ఆపరేషన్ నిమిత్తం చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు కోమటి శంకరావు, రాజాన కొండనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా శేషుబాబు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో కొండెంపూడికి చెందిన సేనాపతి పవన్ కుమార్ కు రూ.1.75 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే రాజు అందజేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, నాయకులు దేవర అప్పారావు, ఎంవీవీ సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షులు, దొడ్డి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ గ్రామాల్లో మినరల్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి

రోలుగుంట, ఆ గస్టు 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని నల్లరాయి క్వారీల ప్రభావిత ఫ్లోరైడ్ గ్రామాల్లో మినరల్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సీపీఎం నేత కె.గోవింద్‌రావు డిమాండ్ చేశారు. గురువారం నర్సీపట్నంలో మైన్స్ ఏడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోలుగుంట, నిండుగొండ, కె.నాయుడుపాలెం, అంట్లపాలెం, మునిపల్లి, ఎన్.కొత్తూరు, కిలపర్తిపాలెం, కొవ్వూరు, గొల్లపేట గ్రామాల్లో ఫ్లోరైడ్ అధికంగాఉన్నట్లు వైద్యాధికారులు గుర్తించారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గవరవరం వాసులు

చోడవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవరవరంలో శ్మశాన స్థలాన్ని కొందరు కబ్జాకు ప్రయతిస్తున్నారని ఆరోపిస్తూ స్థానికులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, ఏడుకులాలకు చెందిన శ్మశానానికి కేటాయించిన స్థలాన్ని స్థానిక మాజీ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ఆక్రమించేందుకు చూస్తున్నారని, దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజుకు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


నాతవరంలో 75 అడుగుల జాతీయ జెండాతో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ


మాకవరపాలెం మండలం తూటిపాల పాఠశాల ఆవరణలో...

నాతవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : హర్ ఘర్ తిరంగా ర్యాలీని గురువారం మండల కేంద్రం నాతవరంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఇక్కడి బీజేపీ నాయకులు 75 అడుగుల జాతీయ జెండాతో బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కె.వరహాలబాబు, బ్రహ్మజీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కూండ్రపు సత్యనారాయణ, కశిరెడ్డి శివాజీ, వేముల సూర్యనారాయణ, లక్కోజు విక్రమ్, అంకంరెడ్డి నాగభూషణం తదితరులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తూటిపాలలో...

మాకవరపాలెం : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను చేతబట్టి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతా సోదరభావంతో మెలగాలని, దేశభక్తి కలిగి ఉండాలని నినాదాలు చేశారు. తొలుత ఉపాధ్యాయుడు రాము మాట్లాడుతూ జాతీయ జెండా పట్ల అందరూ గౌరవం భావం కలిగి ఉండాలన్నారు. జెండాలోని కాషాయరంగు త్యాగానికి, తెలుపు శాంతికి, ఆకుపచ్చ పంటల సమువృద్ధికి, అశోక చక్రం ప్రగతికి చిహ్నమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తోటివారిపట్ల ప్రేమగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

డోలీలతో గిరిజనుల వినూత్న నిరసన

» రోడ్డు పనులు చేపట్టాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం డొంకాడ గ్రామానికి రహదారి పనులు చేపట్టాలని కోరుతూ గిరిజనులు డోలీలతో గురువారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు గోవిందరావు మాట్లాడుతూ కొత్త ఎల్లవరం పంచాయతీ డొంకాడ గ్రామం నుంచి కరక ఆర్అండ్‌బీ రోడ్డు వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేసి మూడేళ్లు గడుస్తున్నా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. అదే విధంగా రోలుగుంట మండల ఆర్ల నుంచి పిత్రిగెడ్డ గ్రామానికి రోడ్డు పనులు మొదలు పెట్టి మధ్యలో ఆపేశారని, వెంటనే ఈ రెండు రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పంచాయతీ రాజ్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద డోలీలతో ధర్నా చేస్తున్న గిరిజనులు

అథ్లెటిక్స్‌లో చైతన్యకు స్వర్ణం


రన్నింగ్‌లో పతకం సాధించిన చైతన్య

దేవరాపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) మండలంలోని వేచలం జడ్పీ హైస్కూల్ లో పదో తరగతి చదువుతున్న బడల బడల చైతన్య అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించింది. బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన 36వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్‌లో (600-800 మీటర్ల) పరుగు పందెంలో ఈ పతకం సాధించినట్టు ఎంఈవో ఉషారాణి తెలిపారు.

గొలుగొండలో కేంద్ర బృందం పర్యటన

» విద్యాలయాలు, కార్యాలయాల్లో పారిశుధ్యం పరిశీలన


పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యుడు

గొలుగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం గొలుగొండలో 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2025'లో భాగంగా కేంద్ర బృందం గురువారం పర్యటించింది. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ కార్యాలయం, సచివాలయాల్లో పారిశుధ్య, మరుగుదొడ్ల నిర్వహణపై ఆరాతీశారు. పరిసరాలను పరిశీలించి ఆయా అధికారులకు పలు సూచనలు చేశారు ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించనున్నామని బృందం సభ్యుడు ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజీ, ఈవోపీఆర్డీ బాబూరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులస్థులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

» ప్రభుత్వానికి జిల్లా అధ్యక్షుడు ఎర్రంశెట్టి అప్పన్నబాబు విజ్ఞప్తి



కృష్ణాదేవిపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెల్లి కులస్థుల సంక్షేమానికి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రంశెట్టి అప్పన్నబాబు కోరారు. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట గురవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడుగుబలహీన వర్గాలకు చెందిన రెల్లి కులస్థులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని వాపోయారు. వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం తమ విషయంలో న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

బహ్రెయిన్ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా శెట్టి సతీశ్



నాతవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బహ్రెయిన్ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా నాతవరం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ శెట్టి సతీశ్ నియామకమయ్యారు. ప్రస్తుతం తాను ఉన్న దేశంలో 50 వేలకు పైగా తెలుగువారు ఉన్నట్టు ఇక్కడి విలేకరులకు ఆయన తెలియజేశారు. స్థానికంగా చేపట్టిన పార్టీ కార్యకలాపాలను గుర్తించి తనను ఈ పదవికి ఎంపిక చేసినట్టు చెప్పారు.


చోడవరంలో డిగ్రీ విద్యార్థినుల ర్యాలీ



చౌడువాడలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ జెండా రెపరెపలు

చోడవరం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులు తిరంగా యాత్ర నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి. సత్యవతి, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, బిచ్చమ్మ, లెక్చరర్లు సుధీర్, అప్పలనాయుడు, నారాయణమూర్తి. తదితరులు పాల్గొన్నారు.

తెనుగుపూడిలో 100 మీటర్ల జాతీయ జెండాతో

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి గురుకుల విద్యార్థులు 100 మీటర్ల జాతీయ జెండాతో గురువారం ర్యాలీ నిర్వహించారు.ప్రిన్సిపాల్ విక్టర్‌పాల్, పీడీ ఉమామహేశ్వరరావు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

400 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడలో 400 అడుగుల జాతీయ జెండాతో స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులతోపాటు గ్రామ స్థులు, పెద్దలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాడి ఎరుకునాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు ఏటుకూరి రాజేశ్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పంచాయతీ ఈవో పి. సురేశ్‌బాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ ఎస్.గంగాధర్, పాఠశాల హెచ్ఎం రమణబాబు, పాల్గొన్నారు.



తెనుగుపూడి గురుకుల పాఠశాలలో 100 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన

రావికమతంలో

రావికమతం: మండలకేంద్రంలో ఎంపీడీవో సీతారామస్వామి ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో వి.మంగతాయారు, ఉపాధి ఏపీవో చిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి


హెచ్‌సీ సాంబమూర్తి(ఫైల్)

చీడికాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కోనాం గ్రామానికి చెందిన చలుగు సాంబమూర్తి (49) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న కె.కోటపాడు సీఐ పైడం నాయుడు, ఎస్ఐ బి.సతీశ్ పోలీసులు గ్రామానికి వచ్చి సంతాపం తెలిపారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పెద్దలు చలుగు దేముడునాయుడు, అప్పలనాయుడు, జగన్నాధం పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ర్యాలీ


చోడవరంలో ర్యాలీ

చోడవరం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో గురువారం సాయంత్రం అన్నదాత సుఖీభవ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎడ్లబళ్లపై స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు, ఇతర టీడీపీ నేతలు సందడి చేశారు. అన్నదాత సుఖీభవ పథకంతో ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలిచిందని ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు తెలిపారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు, మజ్జి గౌరీశంకర్, ఎర్రంశెట్టి చిన్న, దేవరపల్లి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

దండిసురవరంలో దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చీడికాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దండిసురవరంలో శ్రీదుర్గాలమ్మ విగ్రహప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు.మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ కోన అర్జున, పీఏసీఎస్ అధ్యక్షులు బొబ్బాది తాతారావు, ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు, టీడీపీనేత పోతల చిన్నంనాయుడు, రెడ్డి రాము, వైసీపీ నాయకులు గొల్లవిల్లి రాజుబాబు, పాల్గొన్నారు.

దొండపూడిలో ...

రావికమతం: మండలంలోని దొండపూడిలో నూతనంగా నిర్మించిన దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. తొలి దర్శనం ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, రాష్ట్ర గృహనిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్‌రాజు, పార్టీ మండల అధ్యక్షులు కోమటి శంకరావు, మాజీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, వివి ఆచారి తదితరులు చేసుకున్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. అలాగే, అమ్మవారిని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు,ఎంపీపీ పైల రాజు తదితరులు దర్శించుకున్నారు. నేతలు ముక్కామహాలక్ష్మినాయుడు, కంచిపాటి జగన్నాథరావు, మాడుగుల ఎంపీపీ తాళపురెడ్డి రాజారామ్, గవ్రెడ్డి తాతబాబు పాల్గొన్నారు.


దొండపూడిలో దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు,ఎమ్మెల్యే రాజు, తాతయ్యబాబు, తదితరులు


హోమంలో నవధాన్యాలు వేస్తున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు, తదితరులు

పిపి అగ్రహారం భూలోకమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బుచ్చెయ్యపేట: పిపి అగ్రహారంలో భూలోకమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బత్తుల తాతయ్యబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. నైదాన నానిబాబు, సిమునిరి గణేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో అనకాపల్లి కీలక పాత్ర


ఉద్యమకారులు మిస్సుల సూర్యనారాయణమూర్తి, భీశెట్టి అప్పారావు (ఫైల్ ఫొటోలు)



- శాఖవీధిలో ఉద్యమకారుల రహస్య స్థావరం
- ఎందరో ఉద్యమకారులు ఇక్కడే అజ్ఞాత వాసం
- మహాత్మాగాంధీ రెండు సార్లు అనకాపల్లి సందర్శన
- పలువురు గాంధేయ వాదులు, సామాన్యులు ఉద్యమంలో చురుకైన పాత్ర

అనకాపల్లి అగ్రికల్చర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అనకాపల్లి ప్రాంతం కీలక పాత్ర పోషించింది. అనకాపల్లిలోని శాఖవీధిలో ఉద్యమకారులు రహస్య స్థావరాన్ని నిర్వహించారు. ఈ స్థావరం అనకాపల్లి రైల్వేస్టేషన్‌కి పక్కనే ఉండడంతో వచ్చి పోయేందుకు అనువుగా ఉంటుందని ఉద్యమకారులు ఎక్కడెక్కిడి నుంచో వచ్చి ఇక్కడ కొన్నాళ్లు తలదాచుకుని వెళ్లేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్రపతిగా పని చేసిన వీవీ గిరి కూడా అప్పట్లో ఇక్కడ అజ్ఞాత వాసం గడిపారని స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న కొడుకుల వెంకన్న చెప్పేవారు. బారువారి వీధిలో నివాసముండే వెంకన్న సోదరి కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ అనకాపల్లిని రెండు సార్లు సందర్శించారు. మొదటిసారి విదేశీ వస్తు బహిష్కరణ సమయంలో ఆయన గాంధీ మార్కెట్ వద్ద వర్తకులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మరోసారి విశాఖకు వెళుతూ అనకాపల్లి రైల్వేస్టేషన్లో కొంతసేపు ఆగి ప్రజలతో మాట్లాడారు. కాగా బొజ్జన్న కొండ పక్క నుంచి ప్రవహించే శారద నదిని మళ్లించి ఎక్కువ విస్తీర్ణం వ్యవసాయం కిందకు వచ్చేలా కృషి చేసిన జగన్నాథ పాయకరావు ఉద్యమకారులకు ఆశ్రయం ఇచ్చారనే నెపంతో బ్రిటిష్ ప్రభుత్వం అనకాపల్లి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో బహిరంగంగా ఉరితీసింది. అనకాపల్లికి చెందిన కోరుకొండ లింగమూర్తి, భీశెట్టి అప్పారావు, మిస్సుల సూర్యనారాయణమూర్తి, ఎస్ఆర్ఎస్ అప్పలనాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు వంటి గాంధేయ వాదులతో పాటు ఎందరో సామాన్యులు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. 1944 చివర్లో కోరుబిల్లి జగ్గారావు అనే టీచర్, జక్కన హళ్లి శ్రీరామ్మూర్తి అనే కాంపౌండర్ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పనిచేశారని వెల్లూరు జైల్లో పెట్టారు. సూరిశెట్టి జగ్గయ్య, వీవీ రమణ ఉద్యమంలో గట్టిగా పనిచేశారు. అలాగే కొందరు జైలు జీవితం గడిపారు. అయితే జైలు రికార్డులు సక్రమంగా లేకపోవడంతో వారి చరిత్ర రికార్డులకు ఎక్కలేదు. సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అనకాపల్లిలో ప్రదర్శనలు, ర్యాలీలు జరిగాయి. సహాయ నిరాకరణ ఉద్యమంలో అనకాపల్లిని ఉద్యమ ప్రాంతీయ కేంద్రంగా సమరయోధులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ వివరాలను సుప్రసిద్ధ చరిత్రకారుడు తల్లాప్రగడ సత్యనారాయణమూర్తి సేకరించి అప్పట్లో అనకాపల్లి చరిత్ర పేరిట పుస్తకం ప్రచురించారు. కొన్నేళ్ల క్రితం ఆయన అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో చరిత్ర విభాగం అధిపతిగా పని చేసి పదవీవిరమణ చేశారు. అనకాపల్లిలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశం ఏర్పాటు కావడం వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. ఆయన నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లో కన్నుమూశారు. అయితే ఆయన రాసిన పుస్తకంతో అనకాపల్లిలోని స్వాతంత్ర్య ఉద్యమకారుల వివరాలు వెలుగులోకి వచ్చాయి.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పెదగుమ్ములూరు విద్యార్థినులు ఎంపిక


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు హరిణి, పావనితో ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న అమరావతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కనిగిరి హరిణి, పోలిశెట్టి పావని ఎంపికయ్యారని హెచ్ఎం సుధామాధురి గురువారం తెలిపారు. ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-15 విభాగంలో వీరు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయిని నిర్మల, తదితరులు అభినందించారు.

జీవీ వీధి సంతలో అల్లం ధర పతనం

- కిలో రూ.20కి అమ్ముకోవాల్సిన దుస్థితిలో గిరిజన రైతు


జీకేవీధి సంతలో విక్రయించేందుకు రైతులు తీసుకు వచ్చిన అల్లం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అల్లం ధర ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం జీకే వీధి వారపు సంతలో వర్తకులు కిలో రూ.20 ధరకు కొనుగోలు చేశారు. ప్రతి ఏడాది గిరిజన రైతులు ఆగస్టు మాసంలో పాత అల్లం సేకరించి మార్కెటింగ్ చేస్తుంటారు. గత ఏడాది పాత అల్లం కిలో రూ.100కు వర్తకులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ధర భారీగా తగ్గిపోవడంతో కనీసం కూలీ ఖర్చు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లం పంటను కేవలం ప్రైవేటు వర్తకులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కాఫీ తరహాలో అల్లం పంటకు ప్రభుత్వరంగ సంస్థలు మార్కెటింగ్ సదుపాయం కల్పించడం లేదు. దీంతో ప్రైవేటు వర్తకులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. గిరిజన రైతులు మైదాన ప్రాంతాలు, పట్టణాలకు తరలించి మార్కెటింగ్ చేసుకునే పరిస్థితి లేక తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు.

అన్నదాత సుఖీభవ సంఘీభావ ర్యాలీ

- భారీగా తరలివచ్చిన రైతులు, మహిళలు, కూటమి నాయకులు


విజయోత్సవ ర్యాలీ సందర్భంగా నెహ్రూచౌక్‌లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, కూటమి నాయకులు

కొత్తూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణం రింగు రోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయం నుంచి అన్నదాత సుఖీభవ రైతుల ర్యాలీని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం ప్రారంభించారు. జడివానను సైతం లెక్క చేయకుండా ఎద్దుల బండిపైకి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఎక్కి రింగురోడ్డు నుంచి నెహ్రూచౌక్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మండలం సుందయ్యపేట, కూండ్రం, తుమ్మపాల, వెంకుపాలెం, తగరంపూడి గ్రామాల నుంచే కాకుండా కశింకోట మండలం నుంచి కూడా పెద్ద ఎత్తున రైతులు ఎడ్ల బండ్లను తీసుకువచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. అదే విధంగా 150కి పైగా ట్రాక్టర్లు పాల్గొన్నాయి. అంతకు ముందు జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రభుత్వం ఏడాది కాలంలో రైతులకు మంజూరు చేసిన సంక్షేమ పథకాలను, భవిష్యత్తులో రైతులకు అందజేయనున్న ఆర్థిక పరమైన భరోసాలను వివరించారు. ర్యాలీ వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగగా, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి పట్టణంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆరాధ్యకు చోటు


అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు అందజేసిన జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో ఆరాధ్య బెహరా


ఆరాధ్య బెహరాను అభినందిస్తున్న ఎంఈవోలు దివాకర్‌రావు, సాయిశైలజా

- బాపడుపాలెం ఎంపీపీ పాఠశాల ఒకటో తరగతి విద్యార్థినికి అరుదైన గౌరవం

పరవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భరణికం పంచాయతీ పరిధి బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరాధ్య బెహరాకు అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. మైండ్ మ్యాపింగ్‌లో అసాధారణ జ్ఞాపకశక్తిని కనబరచడంతో ఈ అరుదైన గౌరవం దక్కింది. ఏ నుంచి జడ్ వరకు ఆంగ్ల అక్షరాలతో కూడిన కార్డులను కనిపించకుండా వెనక్కి తిప్పి బెంచిపై వరుస క్రమంలో కాకుండా ఉంచిన వాటిని ఆరాధ్య ఏ అక్షరం ఏ కార్డులో ఉందో వరుస క్రమంలో వాటిని ఒక నిమిషం 30 సెకన్‌ల్లో గుర్తించి అదరహో అనిపించింది. ఈ అద్భుతమైన విజయాన్ని అధికారికంగా అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేశారని పాఠశాల ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధరరావు తెలిపారు. కాగా మైండ్ మ్యాపింగ్‌లో ఆరాధ్య కనబరిచిన ప్రతిభ పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గత నెల 18న ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలియజేసిన సంగతి తెలిసిందే. ఆరాధ్య అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడం పట్ల ఎంఈవోలు ఎం.దివాకర్‌రావు, జి.సాయి శైలజా గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు గంగాధరరావు, ఎస్టీపీసీ సీఎస్ఆర్ ప్రతినిధులు ప్రకాశరావు, శివం, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బీచ్‌లో మహిళ మృతి

- మృతురాలి స్వస్థలం సికింద్రాబాద్
- రక్షించేందుకు యత్నించిన యువకుడి గల్లంతు
- మరొకరిని కాపాడిన లైఫ్ గార్డులు


వసంత మృతదేహం

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రామకృష్ణా బీచ్ సందర్శనకు వచ్చిన వారిలో ఒక మహిళ సముద్రంలో మునిగి మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. ఇంకొకరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌లోని విమలాదేవి నగర్‌లో గల మైత్రీ నివాస్‌లో నివాసముంటున్న టి.కోటేశ్వరరావు భార్య వసంత (58), బంధువు సాయికృష్ణ (35) తదితరులతో కలిసి సింహాచలంలో ఓ పెళ్లికి వచ్చారు. అక్కడి నుంచి గురువారం సాయంత్రం ఆర్కే బీచ్‌కు వెళ్లారు. ప్రమాదకరమని తెలియక స్నానం చేసేందుకు సముద్రంలో దిగారు. అలలు ఉధృతంగా రావడంతో వసంత, సాయికృష్ణ లోపలకు కొట్టుకుపోయారు. కళ్లెదుటే మునిగిపోతున్న వారిని రక్షించేందుకు అక్కడే ఉన్న ఒడిశాకు చెందిన గోవింద్ (26) యత్నించి, అతడు గల్లంతయ్యాడు. మరోవైపు లైఫ్‌గార్డులు కూడా బాధితులను కాపాడేందుకు సముద్రంలోకి దిగారు. మునిగిపోతున్న సాయికృష్ణను రక్షించి క్షేమంగా తీరానికి చేర్చారు. అయితే అప్పటికే కోటేశ్వరరావు భార్య వసంత మృతిచెందింది. గల్లంతైన గోవింద్ పెందుర్తిలోని ఓ రొయ్యల కంపెనీలో పనిచేస్తున్నట్టు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

'కిల్లాడ'కు రాష్ట్రపతి సేవా పతకం

... 7వ పేజీ తరువాయి

ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. నర్సీపట్నం గ్రంథాలయానికి ఏటా రూ.50-60 వేల విలువ చేసే ఉద్యోగ పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ అదనపు డీజీపీగా సేవలు అందిస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ హత్య

... 7వ పేజీ తరువాయి

వయసు వుంటుందని గుర్తించారు. అక్కడ వున్న ఆనవాళ్లనుబట్టి.. గుర్తు తెలియని వ్యక్తులు మంచం పట్టితో ఆమె కాళ్లు, చేతులు కట్టేసి, మెడకు టవల్ బిగించి హత్యచేసి వుంటారని, బుధవారం అర్ధరాత్రి తరువాత మృతదేహాన్ని ఇక్కడకు తెచ్చి పడేసి పెట్రోలు పోసి నిప్పటించారని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతురాలు గర్భవతి అని, శరీరంపై పచ్చ, నలుపు, గులాబీ రంగు నైటీ, ఎరుపు రంగు చున్నీ, లేత గులాబీ రంగు లోదుస్తులు ఉన్నాయన్నారు. శరీరంపై రోల్డ్‌గోల్డు నల్లపూసలు, చెవి దుద్దులు, ఎరుపు రంగు మట్టి గాజులు, రబ్బరు బ్యాండ్ ఉన్నాయని తెలిపారు. సమాచారం అందుకున్న క్లూస్ టీమ్, ఎఫ్ఎస్ఎల్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించారు. ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీలు దేవా ప్రసాద్, మోహన్‌రావు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మార్గంలో వెళుతున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కారు దిగి, సీఐ రామచంద్రరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా నిర్వహించిన అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మూడు రోజుల్లో మృతురాలి సంబంధీకులు ఎవరైనా వస్తే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అప్పగిస్తామని సీఐ రామచంద్రరావు తెలిపారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో స్మార్ట్ కంట్రోల్ రూమ్

... 7వ పేజీ తరువాయి

చెందిన స్థలాన్ని పార్కింగ్ కోసం అభివృద్ధి చేశారన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాలో స్మార్ట్ పోలీసింగ్ అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా డ్రోన్లు, అధునాతన సీసీ టీవీ కెమెరాలు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాంతిభద్రతలతోపాటు ట్రాఫిక్ సమస్యను తొలగించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీఎస్పీలు ఎం.శ్రావణి, శ్రీనివాసులు, సీఐలు బాల సూర్యారావు, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య

అచ్యుతాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌టీబీఎల్ కాలనీకి చెందిన ఓ వివాహిత ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుందని సీఐ నమ్మి గణేశ్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మన్యం జిల్లా వీరఘట్టానికి చెందిన కొండల శంకరరావు, భార్య గాయత్రి(21)తో కలిసి అచ్యుతాపురంలోని ఎస్‌టీబీఎల్ కాలనీలో నివాసముంటున్నారు. శంకరరావు సెజ్‌లోని ఎం ఎస్ఎంఈలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన బుధవారం ఉదయం విధులకు వెళ్లి రాత్రి 8.30 గంటలకు ఇంటికి వచ్చారు. తలుపులు తీసి చూడగా వంటగదిలో భార్య చున్నీతో ఉరిపోసుకొని ఉన్నట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

22 టేకు దుంగలు స్వాధీనం, ఇద్దరిపై కేసు


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు కలప

నర్సీపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.లక్ష విలువ చేసే టేకు కలపను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు నర్సీపట్నం రేంజ్ అధికారి కేవీ రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం కోటవురట్ల మండలం తంగేడు వైపు నుంచి వ్యాన్‌లో 22 టేకు దుంగలు తరలిస్తుండగా ఎండపల్లి వద్ద పట్టుకున్నామని పేర్కొన్నారు. వ్యాన్ యజమాని కమ్ డ్రైవర్ పి.శ్రీరామమూర్తి, కలప యజమాని సింగంపల్లి కృష్ణలపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రౌడీషీటర్‌పై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రౌడీ షీటర్ పప్పల వరప్రసాద్ నాయుడుపై జరిగిన దాడి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ రేవతమ్మ గురువారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ రాత్రి నెల్లిమెట్ట కూడలి బుచ్చింపేట రోడ్డులోని మద్యం దుకాణం సమీపంలో వెలమ వీధికి చెందిన ఇతనికి, కాపు వీధికి చెందిన కొంత మంది యువకుల మధ్య గొడవ జరిగింది. తరువాత ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. అయితే పప్పల నాయుడును అంతమొందించాలన్న ఉద్దేశంతో కొంతమంది వ్యక్తులు రాడ్లు, బీరు సీసాలతో దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సేనాపతి రవికిరణ్, మంతిన త్రిమూర్తులు, సకల లోవకుమార్‌లను గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ తెలిపారు.

చెరువులో పడి రైతు మృతి

చీడికాడ ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరంలో రైతు ఒకరు ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతిచెందాడు. ఎస్ఐ బి.సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్లె రామునాయుడు (50) గురువారం పశువులను పెద్ద చెరువు వద్దకు మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం పశువులు చెరువులోకి దిగగా, వాటిని బయటకు రప్పించేందుకు ఒడ్డు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి చెరువులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. భార్య ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

మన్యంలో కుండపోత


పాడేరులో కురుస్తున్న వర్షం

పాడేరు, ఆగస్టు 14:(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మన్యంలో గురువారం కుండపోతగా వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి వాతావరణం మారిపోయి ఒక్కసారిగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలయమం కాగా, గెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవహించాయి. సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసి, ఆ తరువాత ముసురు వాతావరణం కొనసాగింది.

యర్రవరం జలపాతం మూసివేత

చింతపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిపాకలు పంచాయతీ యర్రవరం జలపాతాన్ని రెవెన్యూ అధికారులు మూసివేశారు. వర్షాలు తగ్గే వరకు పర్యాటకులు ఇక్కడికి రావద్దని తహశీల్దార్ జి.ఆనందరావు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాగల ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, పర్యాటకుల సందర్శనలు నిలిపివేయాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు.

లిడ్ పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండా


సూక్ష్మ కళాకారుడు సంజయ్‌దీపక్


లిడ్ పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండా, ఐ లవ్ ఇండియా చెక్కిన దృశ్యం

పాయకరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేటకు చెందిన సూక్ష్మ కళాకారుడు కుందూరు సంజయ్‌దీపక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లిడ్ పెన్సిల్ ముల్లు(0.7)పై జాతీయ జెండాతోపాటు ఐ లవ్ ఇండియా అని మైక్రో స్కోప్ వినియోగించకుండా చెక్కి తన కళానైపుణ్యాన్ని మరోమారు నిరూపించుకున్నాడు.

హార్టికల్చర్‌కు అధికారుల కొరత

... 7వ పేజీ తరువాయి

పరికరాలకు రాయితీలు పెంచింది. జిల్లాలో వాణిజ్యపరంగా ఉద్యాన పంటల సాగుకు అవసరమైన ప్రణాళికలు కూడా రూపొందించింది. దీంతో ఉద్యాన పంటల సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. కానీ అధికారులు అందుబాటులో లేకపోవడం ప్రతిబంధకంగా మారింది. ఒక్కో హెచ్‌వో నాలుగైదు మండలాలను పర్యవేక్షించాల్సి రావడంతో రైతులు హెచ్‌వోల కోసం నిరీక్షించాల్సి వస్తున్నది. వాస్తవానికి ఉద్యానపంటల పరంగా మాడుగుల, చీడికాడ, రావికమతం, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట మండలాల్లో పామాయిల్‌సాగు ఎక్కువగా ఉంది. చోడవరం, బుచ్చెయ్యపేట, చీడికాడ, రావికమతం మండలాల్లో జీడిమామిడి, మామిడి తోటలు, కూరగాయ పంటల సాగు ఎక్కువగానే ఉంది. ఇంతటి ముఖ్యమైన మండలాలకు రెగ్యులర్ హార్టికల్చర్ అధికారులు లేకపోవడం రైతులకు శాపంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ఉద్యాన శాఖకు పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519